విశాలాంధ్ర
తిరుపతి జిల్లా
చిత్తూరు జిల్లా

శ్రీనివాస మంగాపురం కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర-చంద్రగిరి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా చంద్రగిరి మండలం శ్రీనివాసా మంగాపురంలో వెలసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దర్శన ఏర్పాట్లు కూలైన్లను పగడ్బందిగా నిర్వహించేందుకు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు పర్యవేక్షించారు. ఈ మేరకు ఆయన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు, క్యూలైన్లను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. భక్తుల రాక పోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. తొక్కిసలాట వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని చంద్రగిరి సీఐ సురేష్ కుమార్‌కు ప్రత్యేక సూచనలు సలహాలు చేశారు. అవసరమైన చోట అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలన్నారు. అలాగే భక్తులకు తాగునీరు, వైద్య సదుపాయాలు, శానిటేషన్ వంటి మౌలిక వసతులు కల్పించాలని దేవస్థాన అధికారులు పోలీసు శాఖ సమన్వయంతో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పండుగను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ సుబ్బారాయుడు కోరారు.

అమ్మవారి సేవలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి ఆలయ డిప్యూటీ ఈఓ హరేంద్రనాథ్, ఎఈఓ దేవరాజులు, ఏవీఎస్ఓ రాధాకృష్ణమూర్తి, తిరుపతి డివిజనల్ అధికారి (ఆర్డిఓ) రామ్మోహన్, సూపరింటెండెంట్ సురేష్, మునిచంగల్రాయులు, రమేష్, ఇన్స్పెక్టర్లు ప్రసాద్, చలపతి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయ అధికారులు అమ్మవారి వస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పరిశీలించిన టీటీడీ చైర్మన్

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా టీటీడీ చేసిన ఏర్పాట్లను సోమవారం సాయంత్రం టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా గోగర్భ డ్యామ్ సర్కిల్ వద్దకు చేరుకున్న చైర్మన్ భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు, సదుపాయాలపై పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం శిలాతోరణం, కృష్ణతేజ విశ్రాంతి గ ృహాల వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌డి టోకెన్ల తనిఖీ కేంద్రంలో తనిఖీ ప్రక్రియను పరిశీలించి భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో భక్తుల కోసం అన్ని ఏర్పాటు సిద్ధం చేయడం జరిగిందన్నారు. భక్తులందరికీ సౌకర్యవంతంగా దర్శనం కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. పోలీసులు, విజిలెన్స్, టీటీడీ యంత్రాంగం సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ వైకుంఠ ద్వార దర్శనాలను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ వెంట టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, నరేష్, సీవీఎస్వో మురళీకృష్ణ, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రజా వేదికకు 428 వినతులు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 428 వినతులు (అర్జీలు) వచ్చాయని అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ ఎస్) నిర్వహించడం జరిగినది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, శివ శంకర్ నాయక్, సుధారాణి, రోజ్మాండ్ లు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు: రెవెన్యూ -270, పంచాయతీ రాజ్ -40, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -29, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ -1, రిజిస్ట్రేషన్ శాఖ -3, సివిల్ సప్లైస్ -4, మెప్మా -1, సోషల్ వెల్ఫేర్ -1, స్కిల్ డెవలప్మెంట్ -1, విద్యుత్ శాఖ -3, పాఠశాల విద్యాశాఖ -3, వ్యవసాయ శాఖ -2, కో-ఆపరేటివ్ సొసైటీస్ -1, ఎండోమెంట్ -2, సెర్ప్ -19, పోలీస్ -20, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ -2, పబ్లిక్ హెల్త్ అండ్ ఫామిలీ వెల్ఫేర్ -3, జిల్లా సహకార ఆరోగ్య సేవలు -1, ఎస్ఎస్ఎల్ఆర్ -8, సమగ్ర శిక్షా అభియాన్ -1, గ్రామీణ నీటి సరఫరా -2, టిటిడి -5, టూరిజం -1, రవాణా శాఖ -1, బ్యాంక్ -1, నీటి వనరులు -1, కార్మిక శాఖ -1, ఏపిఎస్ ఆర్టిసి -1, మొత్తం వెరసి 428 అర్జీలు వచ్చాయని తెలిపారు.

తుమ్మలగుంట శ్రీ కళ్యాణ వెంకన్న ఆలయంలో..

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

భద్రత పరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్న పోలీసులు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: తిరుపతి నగరానికి సమీపంలోని తుమ్మలగుంట గ్రామలోం వెలసియున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం జరిగే వైకుంఠ ఏకాదశి పర్వదినానికి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఆలయం ముందు, పరిసరాల్లో పటిష్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేయగా భక్తులకు సాదర స్వాగతం పలికేలా సప్తద్వారాలు ఏర్పాటు చేశారు. రంగు, రంగుల దీపాలు, విశేషమైన పుష్పాలతో ఆలయం లోపల, బయటకు అందంగా అలంకరించారు. రంగు రంగుల పరదాలతో చలువ పందిర్లు భక్తులకు నీడనిస్తుండగా పచ్చని తోరణాలు సాదరంగా స్వాగతం పలుకుతున్నాయి. గత వారం రోజులుగా ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు దగ్గరుండి పర్యవేక్షణ చేస్తున్నారు. శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి కొలువైన గర్భాలయం చుట్టు వున్న వైకుంఠ ద్వారం మంగళ వారం తెల్లవారు జామున 3గంటలకు తెరవనున్నారు. ప్రత్యేక పూజలు చేసిన తరువాత ఆలయ అర్చకులు, వేదపండితులు, నిర్వాహకులు వైకుంఠ ద్వార ప్రవేశం చేస్తారు. అనంతరం భక్తులు అందరికీ వైకుంఠ ద్వార ప్రవేశం కల్పించనున్నారు. భక్తులు ఎంతో భక్తితో ప్రవేశించే వైకుంఠ ద్వారాన్ని అరుదైన పుష్పాలతో అందంగా ముస్తాబు చేశారు. ఓం నమో నారాయణాయః అన్న మంత్రం భక్తులకు నెమ్మదిగా వినిపించేలా అక్కడక్కడ చిన్నపాటి మైక్‌లను పుష్పాల మధ్యాన అమర్చారు.ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం పటిష్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాల్లో ఏర్పాటు చేసిన సప్తద్వారాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆలయం ముందు కళాకారుల న ృత్యాలు ప్రదర్శన చేయడానికి అనువుగా ప్రత్యేకమైన వేదికను ఏర్పాటు చేశారు. అలాగే భక్తులు అందరికీ ఆలయం లోపల, బయట జరిగే వేడుకలు కనిపించేందుకు అక్కడక్కడ ఎల్ఈడీ స్క్రీన్‌లను కూడా ఏర్పాటు చేశారు. తుమ్మలగుంట ఆలయంతో పాటు గ్రామ పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాల కటౌట్లు నుంచి వచ్చే వెలుగులు ఆధ్యాత్మిక శోభను ఉట్టిపడేలా చేస్తున్నాయి. తెలుగు తల్లి విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీ పద్మావతీ సమేత శ్రీనివాసుని విద్యుత్తు కటౌట్ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది విద్యుత్తు వెలుగుల మధ్యన పుష్పాలంకరణ భక్తులకు కనువిందు చేస్తుండగా ఆలయం ముందు వేద పండితులు వేద పఠనం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ధ్వజస్తంభం ముందు గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామిని కొలువుదీర్చనున్నారు.వైకుంఠ ఏకాదశికి ఒక్క రోజు ముందుగానే పోలీసులు ఆలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. వేలాదిగా తరలివచ్చే ఆలయం వద్ద ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. అదనపు ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో సీఐలు, ఎస్సైలు, 60 మంది పోలీసు సిబ్బంది భద్రతా పరంగా విధులు నిర్వహించనున్నారు. ఇప్పటికే పోలీసులు ఆలయం వద్దకు చేరుకుని నిర్వాహకులతో కలసి భద్రతను సమీక్షించారు.

జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు బలోపేతం కావాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-చిత్తూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ప్రవేశపెడుతున్న పథకాలను రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశంజిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు మెరుగైన, నాణ్యమైన వస్తువులను ఉత్పత్తి చేయడానికి వారిని ప్రోత్సహించాలన్నారు. ఇందుకోసం మెరుగైన సాంకేతికత, మార్కెటింగ్ సౌకర్యం తదితర వాటి కోసం సన్న చిన్న కారు రైతులు ఎఫ్‌పీఓలో భాగస్వామ్యం కావడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. జిల్లాలో 31 గ్రూప్స్ ఉన్నాయని తెలిపారు. ఈ గ్రూపుల ద్వారా రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.ప్రతి ఎఫ్ పి ఓ డిజిటల్ మార్కెటింగ్ లోకల్ మార్కెటింగ్ పై అవగాహన పెంచుకునేలా మార్కెటింగ్ నిపుణుల చే శిక్షణ అందించి వారి ఆర్థిక అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఎఫ్ పి ఓ కూడా ప్రభుత్వం ద్వారా కాకుండా స్వంతం గా కూడా ఆర్థిక అభివృద్ధి పొందేలా ఆలోచించి బ్యాంకు ల ద్వారా లబ్ధి పొంది చిన్న తరహా పరిశ్రమ లను ఏర్పాటు చేసుకొని రైతుల ఆర్థిక అభివ ృధి పొందేలాసంబంధించి వివిధ శాఖల అధికారులు కృషి చేయాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుచానూరు పద్మావతి ఆలయంలో జనవరిలో విశేష ఉత్సవాలు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో జనవరి నెలలో పలు విశేష ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వివిధ నక్షత్రాలు, పర్వదినాలను పురస్కరించుకుని వాహన సేవలు, తిరుచ్చి ఉత్సవాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శ్రీ బలరామకృష్ణ స్వామి ఆలయంలో జనవరి 1, 28 తేదీల్లో రోహిణి నక్షత్రం సందర్భంగా రాత్రి 7 గంటలకు శ్రీ కృష్ణ స్వామివారికి తిరుచ్చి ఉత్సవం జరుగుతుందని తెలిపారు. అలాగే జనవరి నెలలో ప్రతి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి ఉత్సవాలు నిర్వహించనున్నారు. జనవరి 10న హస్తా నక్షత్రం, జనవరి 15న సంక్రాంతి పర్వదినం సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామివారు సాయంత్రం 5 గంటలకు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. జనవరి 19న ఉత్తరాషాఢ నక్షత్రం సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారు సాయంత్రం 6.45 గంటలకు గజ వాహనంపై భక్తులను కటాక్షించనున్నారు. జనవరి 24న ఉత్తరాభాద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ సుందరరాజ స్వామివారు సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి వాహనంపై దర్శనమిస్తారు. జనవరి 25న రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారు ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారని అధికారులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

గూడూరు డీఎస్పీ గీతా కుమారి

విశాలాంధ్ర -గూడూరు: నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాల ని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని గూడూరు డీఎస్పీ గీతా కుమారి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ఈనెల 31వ తేదీ రాత్రి రోడ్లపై బైక్ రేసింగ్ లు నిర్వహిస్తే చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా రోడ్లపై కేకులు కట్ చేయకూడదు అన్నారు. డి.జె లకు అనుమతి లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు

తనిఖీల అధికారి వెంకటేశ్వర్లు హెచ్చరిక

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో సోమవారం తనిఖీల బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. తనిఖీల అధికారి వెంకటేశ్వర్లు, చిత్తూరు ఏడీఏ వేణుగోపాల్, ఏడీఏ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. తనిఖీల్లో భాగంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాలు, కొనుగోలు రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. దుకాణాల్లో ఉన్న నిల్వలకు, రికార్డుల్లో ఉన్న అంకెలకు సరిపోలిక ఉందా లేదా అన్న అంశాన్ని సరిచూశారు. ప్రతి లావాదేవీకి సంబంధించి ఇన్వాయిస్ రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని డీలర్లకు సూచించారు. ఈ సందర్భంగా తనిఖీల అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... రైతులను మోసం చేస్తూ ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచినా, అనధికారిక ఎరువులను విక్రయించినా సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధిక ధరలకు ఎరువులు అమ్మితే అటువంటి దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని, వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సురేంద్రరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు: సీఐ మురళీ కృష్ణ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: తిరుపతిజిల్లా సూళ్ళూరుపేట ప్రజలు, యువత ఆనందోత్సాహాల మధ్య కొత్త ఏడాది (2026)కి గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పడానికి, నూతన సంవత్సర ఉత్సవాలు జరుపుకునేందుకు సమయాత్తం అవుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పోలీసుశాఖ తెలిపిన నిబంధనలు పాటించి నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని సూళ్ళూరుపేట సీఐ ఎం.మురళీకృష్ణ తెలిపారు. న్యూ ఇయర్ ఈవెంట్స్ జరుపుకునేవారు ముందుగా పోలీసుల పర్మిషన్ తీసుకోవాలని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడానికి సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ తప్పనిసరని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు ప్రజలందరూ ఆరోగ్య కరమైన వాతావరణంలో జరుపుకోవాలని సీఐ ఎం.మురళీకృష్ణ తెలిపారు తిరుపతిజిల్లా అంతటా 30- పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలందరూ పోలీస్ నిబంధనలు పాటించి తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే వారు రాత్రి 10 గంటల తర్వాత మ్యూజిక్ సిస్టమ్ వాడరాదని తెలిపారు.రాత్రి 10 గంటల తరువాత పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తారు. అత్యవసరమైతేనే బయటకు రావాలని సీఐ మురళీకృష్ణ సూచించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో, ముఖ్యమైన జంక్షన్లు, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో పికెట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మేగజైన్స్, హోర్డింగ్‌ల్లో అశ్లీలత కల పోస్టర్లు, ప్రకటనలు నిషేధం. వేడుకలలో అశ్లీల నృత్యాలు, చర్యలు, సినిమాలు, అశ్లీల సంజ్ఞలు ఆనుమతించబడవని స్పష్టం చేశారు.ఔట్- డోర్ కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో డీజే సౌండ్ బాక్సులు, పటాకులు కాల్చడానికీ అనుమతి నిరాకరిస్తామని సీఐ మురళీక ృష్ణ చెప్పారు. మహిళలపై ఎలాంటి వేధింపులకు పాల్పడకుండా నిరోధించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందన్నారు. వైన్ షాపులు నిర్దేశిత సమయంలోగా మూసివేయాలని స్పష్టం చేశారు. మైనర్లకు మద్యం విక్రయించే దుకాణాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.మోటార్ బైక్‌ల సైలెన్సర్ తీసివేసి ఆధిక శబ్దం వచ్చేలా రోడ్లపై ప్రయాణించరాదని సీఐ మురళీకృష్ణ పేర్కొన్నారు. మద్యం సేవించి రోడ్లపై ప్రయాణించరాదని, వాహనాలపై ఆధిక వేగంతో, ప్రమాదకర డ్రైవింగ్ చేయరాదని తెలిపారు. కట్టుదిట్టంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని, మద్యం మత్తులో వాహనాలను నడిపే వారు, మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. బైక్ రేసర్లపై నిఘా ఉంటుందని చెప్పారు.ఆకతాయిలు, మితిమీరి ప్రవర్తించే యువతను, రోడ్లపై చిందులు తొక్కే మందు బాబులను, ఇష్టానుసారంగా వాహనాలను నడిపే వారిని చిత్రీకరించేందుకు వీడియో కెమేరాలు, డిజిటల్ కెమెరాల వినియోగిస్తామని సీఐ ఎం.మురళీకృష్ణ అన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు. పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం ముమ్మరంగా పెట్రోలింగ్ ఉంటుందన్నారు. పెట్రోలింగ్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను నియమిస్తామన్నారు. తల్లిదండ్రులు, వారి పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని, నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ నిబంధనలు పాటిస్తూ అందరూ నూతన సంవత్సర వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ముందుగా సూళ్ళూరుపేట ప్రజలకు సీఐ ఎం.మురళీ క ృష్ణ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాట్లు ముమ్మరం

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు నియోజక వర్గం పూతలపట్టు మండలం లోని కమ్మ గుట్టపల్లి గ్రామం నందు వెలసియున్న దివ్య క్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయము నందు వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని భక్తులు స్వామివారి కృపకు పాత్రుడవ్వాలని కోరారు. మూడు రోజుల పాటు నిర్వహించు ఆలయ ఉత్సవాలు భక్తులకు కన్నుల పండుగగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు యువరాజులు నాయుడు, తెలుగుదేశం మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, ఆలయ నిర్మాణ దాతలు ఎల్. మునస్వామి నాయుడు కన్నయ్య నాయుడు శ్రీనివాసులు నాయుడు వసంత కుమార్ నాయుడు మాజీ సర్పంచ్ కార్తీక్ చౌదరి ఎల్.సుబ్రహ్మణ్యం నాయుడు విద్యాసాగర్ నాయుడు తదితరులు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపటి నుండి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర-కోట: ప్రతినెల ఒకటో తారీకు ఇవ్వవలసిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఒకరోజు ముందుగా ఈనెల 31 తారీకునే పంపిణీ చేయటం జరుగుతుందని ఎంపీడీవో దిలీప్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న పింఛనుదారులు 31వ తేదీన ఇంటివద్దనే అందుబాటులో ఉండి పింఛను తీసుకోవాల్సిందిగా కోరారు.

ముక్కంటిని దర్శించుకున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణచుగ్ దర్శించుకున్నారు. ఆలయ అతిధిగృహం వద్ద బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచిశ్రీనివాస్, టీటీడీ బోర్డు పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికి దర్శనేర్పాట్లు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు హరీష్‌కుమార్‌రెడ్డి, కోనేటి అయ్యప్ప, సజ్జా హరీష్, సిద్దు రాయల్, శ్రీధర్, రవిరాయల్, దీపక్‌యాదవ్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని సన్నిధి ముస్తాబు

విశాలాంధ్ర-వడమాల పేట: డిసెంబరు 30వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని టిటిడి స్థానిక అప్పలాయిగుంట ఆలయంలో భక్తుల సౌకర్యార్థం విస్తృతంగా ఏర్పాట్లు చేట్టారు. ఆలయం లో ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు, రంగవల్లులు తీర్చిదిద్ది వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించనున్నారు. వడమాల పేట మండలం అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో డిసెంబరు 30న మంగళవారం రోజు వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువ జామున 12.05 నుండి 1.30 గంటల వరకు తిరుప్పావైతో స్వామివారిని మేల్కొలిపి, ధనుర్మాస కైంకర్యాలు నిర్వహిస్తారు. ఉదయం 1.35 నుండి రాత్రి 8 గంటల వరకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు తిరువీధి ఉత్సవం జరగనుంది. అనంతరం రాత్రి కైంకర్యాలు నిర్వహిస్తారు.డిసెంబరు 31న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 6.30 నుండి 7.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని స్థానిక టీటీడీఅధికారులు తెలిపారు.

ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

విశాలాంధ్ర-పుంగనూరు: మాజీ మంత్రివర్యులు పుంగనూరు వైసీపీ శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి సోమవారం రోజున మున్సిపల్ కార్యాలయం నందు ప్రజా దర్బార్ నిర్వహించడం జరిగింది ఈ ప్రజా దర్బార్ కు మున్సిపల్ పరిధిలోని అనేకమంది అర్జీదారులు ఎమ్మెల్యేకి హద్దులు సమర్పించడం జరిగింది ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మా వద్దకు వచ్చిన అన్ని అర్జీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు ఇదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ఒక సోమవారం ఒక మండలం లో ప్రజా దర్బార్ నిర్వహిస్తానని తెలియజేశారు కొంతమంది అధికారులు కూటమి నేతలకు కార్యకర్తలకు గుత్తాది పత్యంగా పనిచేస్తున్నారన్నారు వారిపై కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు ప్రభుత్వంలో పని చేసే అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేయాలి కానీ ఒక పార్టీకి సంబంధించిన నాయకులు కోసం పనిచేయడం మంచి పద్ధతి కాదని తెలియజేస్తున్నామన్నారు కొంతమంది అధికారులు ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారన్నారు శాఖల వారి వచ్చిన అర్జీలను పంపించి పరిష్కరిస్తామన్నారు ఇక్కడ పరిష్కారం కానిటివి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయడం జరుగుతుందని తెలియజేశారు ఒకవేళ అధికారులు మా మాట వినకపోతే మా పార్టీ నాయకులే వారికి బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాష వైస్ చైర్మన్ కోమ్మరి రమణ భీమ్ గాని పల్లి సర్పంచ్ సుబ్రహ్మణ్యం కౌన్సిలర్లు సర్పంచులు ఎంపీటీసీలు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

20 ఏళ్ల భూ వివాదం పరిష్కారం

విశాలాంధ్ర-తొట్టంబేడు: మండల పరిధిలోని శివ నాధపాలెం గ్రామంలో గత రెండు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని భూ సమస్య ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు, ఎంపీడీవో సురేంద్రనాథ్ ప్రత్యేక చొరవతో ఈ వివాదాన్ని పరిష్కరించి... గ్రామ అభివృద్ధిలో కీలకమైన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే... శివనాధపాలెం గ్రామంలో ఒక భూభాగం విషయంలో గత 20 ఏళ్లుగా వివాదం నడుస్తుండటంతో అక్కడ రోడ్డు సౌకర్యం కల్పించడం అధికారులకు సవాలుగా మారింది. దీనివల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గుర్తించిన టీడీపీ మండల అధ్యక్షుడు మునిరాజానాయుడు, ఎంపీడీవో సురేంద్రనాథ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇరు పక్షాలతో మాట్లాడి, భూ సమస్యను సామరస్యంగా పరిష్కరించారు. సమస్య తలెత్తకుండా సర్వేయర్ల సమక్షంలో సరిహద్దులు నిర్ణయించి... వెంటనే సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించి రోడ్డు వేయిస్తుండటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో గోపిరెడ్డి, మాజీ సర్పంచ్ శంకరయ్య, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మధు, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు శంకరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివయ్య సేవలో నందమూరి వసుంధర

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ధర్మపత్ని నందమూరి వసుంధర సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించు కున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఆమెకు దేవస్థానం అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో రాహు-కేతు పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారిని, అమ్మవారిని అంతరాలయ దర్శనం ద్వారా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనం అందజేశారు. అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను, శేషవస్త్రాన్ని బహుకరించారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు గుర్రప్ప శెట్టి, గోపీనాథ్, ప్రొటోకాల్ ఏఈఓ మోహన్, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం, ఏపీఆర్‌ఓ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఏడాది వేడుకల్లో హద్దులు దాటితే కఠిన చర్యలు

-సీఐ ప్రకాశ్ కుమార్ హెచ్చరిక

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు శ్రీకాళహస్తి ఒకటవ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ కుమార్ తెలిపారు. వేడుకల పేరుతో హద్దులు దాటి ప్రవర్తించే వారిపై, ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపుతామని ఆయన హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రజలందరూ సుఖసంతోషాలతో వేడుకలు జరుపుకోవాలని, అయితే ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినమైన జరిమానాలతో పాటు, వాహనాల సీజ్, జైలు శిక్ష తప్పదన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో బ్రీత్ అనలైజర్లతో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. బైక్ రేసింగ్‌లు, అతివేగం, మితిమీరిన శబ్దాలు చేస్తూ వాహనాలు నడపడం వంటి పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా యువత ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు నిర్వహించాలన్నా... డీజే సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేయాలన్నా పోలీసుల నుండి ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. రాత్రి నిర్ణీత సమయం తర్వాత మైకులు వాడకూడదు. వేడుకల ముసుగులో ఎవరైనా మహిళలను వేధించినా అల్లర్లకు పాల్పడినా వారిపై రౌడీషీట్లు తెరుస్తామని సీఐ ప్రకాశ్ కుమార్ హెచ్చరించారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి, నూతన సంవత్సరానికి ప్రశాంత వాతావరణంలో స్వాగతం పలకాలని ఆయన కోరారు. ఏదైనా అనుమానాస్పద వ్యక్తి లేదా సంఘటన కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. "ప్రజల భద్రతే మా ప్రాధాన్యత. నిబంధనలు పాటిస్తూ, కుటుంబ సభ్యులతో సంతోషంగా వేడుకలు జరుపుకోవాలి. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు" అని సీఐ ప్రకాశ్ కుమార్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

డెంగ్యూ నివారణ కోసం నిర్దిష్ట చర్యలు తీసుకోవడం లేదు

మండల సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ శరవణ

విశాలాంధ్ర-సత్యవేడు: డెంగ్యూ నివారణ కోసం నిర్దిష్ట చర్యలు తీసుకోవడంలో సంబంధిత ఆరోగ్యశాఖ అధికారులు విఫలమ వుతున్నట్టు మండల పరిషత్ వైస్ ఎంపీపీ శరవన ఆరోపించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన, ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు పలు సమస్యలను లేవనెత్తారు. తమ గ్రామంలో ప్రతి ఏడాది డెంగ్యూ వ్యాధి ప్రబలుతున్న సంబంధిత దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఆరోగ్యశాఖ పై జరిగిన చర్చలో దాసుకుప్పం పీహెచ్సీ ఎంపిహెచ్ఓ సుబ్రమణ్యం మాట్లాడుతుండగా ఆయన జోక్యం చేసుకొని డెంగ్యూ వ్యాధి ప్రబలి నప్పుడు మొక్కుబడిగా ఆరోగ్య క్యాంపులు నిర్వహిస్తున్నారు తప్ప, శాశ్వతంగా అరికట్టడానికి చొరవ చూపడం లేదన్నారు.తమ గ్రామంలో ఇటీవల డయేరియా వ్యాధికి పలువురు గురైనప్పుడు కనీసం వైద్య పరీక్షలు కూడా నిర్వహించకనే తప్పుడు నివేదికలను సంబంధిత చిన్నపాండూరు పి.హెచ్.సి వైద్యులు ఉన్నతాధికాలకు పంపడంపై రాజగోపాలపురం సర్పంచ్ మధురాజు ప్రశ్నించారు.అయితే దీనిపై ఎంపీడీవో చంద్రశేఖర్ స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఆశ వర్కులు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. ఇటువంటి వాటిపై ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. దాసుకుప్పంలో ప్రధాన మెయిన్ రోడ్డు పక్కనే కొందరు చికెన్ సెంటర్ యజమానులు కోళ్ల వ్యర్థాలను పడేసి పోవడం వల్ల కంపు కొడుతూ పారిశుద్ధ్యం లోపిస్తున్నట్టు గ్రామ సర్పంచ్ రవి రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె సమస్యలకు సంబంధించి 40 వేల రూపాయలు విలువైన ఇంజక్షన్ అందుబాటులో ఉన్నట్టు సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల వైద్యులు విద్యాసాగర్ సభ దృష్టికి తెచ్చారు. త్వరలోనే హెచ్ బి వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నట్టు చిన్న పాండూరు ఎంపిహెచ్ఓ రవీంద్రనాథ్ తెలియజేశారు. 2026 జనవరి, ఫిబ్రవరిలో ట్రాక్టర్ కు సంబంధించిన వివిధ పరికరాలు సబ్సిడీపై అందుబాటులోకి వస్తుందని వ్యవసాయ శాఖపై జరిగే చర్చలు ఏవో మురళి స్పష్టం చేశారు. మరమ్మతు గురైన బాలుర కళాశాల వసతి గృహం స్థానే కొత్త భవనం నిర్మించడానికి ప్రభుత్వం 32 లక్షల రూపాయలు మంజూరు చేసినట్టు స్థానిక అసిస్టెంట్ సంక్షేమ వసతి గృహ అధికారి శేఖర్ బాబు సభ దృష్టికి తెచ్చారు. రెవెన్యూ శాఖపై జరిగిన చర్చలో తహసిల్దార్ రాజశేఖర్ మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన పుదుకుప్పం, తొండగులి తదితర ప్రాంతాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యుత్తు పంపిణీ చేయడంతో పాటు వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి వారంలో మంగళ, శుక్రవారంలో కరెంట్‌పోల్లు జనబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు విద్యుత్ శాఖపై జరిగిన చర్చలో సంబంధిత ఏఈ వాసుదేవయ్య సభకు వివరించారు. పాఠశాలకు వెళ్లిన స్కూల్ పిల్లలు ఇండ్లకు చేరుకునే సందర్భంలో బస్టాపుల వద్ద ఆర్టీసీ బస్సులు ఆగడం లేదని మండల పరిషత్ కోఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ ఆరోపించారు. దీనిపై సంబంధిత ఆర్టీసీ డిఎం వెంకటరమణ స్పందిస్తూ దీనిపై ఆర్టీసీ డ్రైవర్ స్పష్టమైన ఆదేశాలి ఇచ్చి బస్సులు ఆగేల చర్య తీసుకుంటామన్నారు. ప్రతి గ్రామంలోనూ చెత్త తొలగింపు కోసం వచ్చే నెల 5వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో షణ్ముగం సభ దృష్టికి తెచ్చారు.అనంతరం ఎంపీపీ ప్రతిమ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను అధికారులు తప్పక పరిష్కరించాలన్నారు. అయితే కొంతమంది అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంఈఓ రవి,మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమ రావు, ఉపాధి ఏపీవో విజయభాస్కర్, అటవీ శాఖ అధికారులు దేవరాజులు, షణ్ముగం, మండల పరిషత్ ఇంజనీర్ ఇబ్రహీం ఖాన్, సత్యవేడు పంచాయతీ సెక్రెటరీ మునిరవికుమార్, వెలుగు కోఆర్డినేటర్లు శివకుమార్, పుల్లయ్య, వైస్ ఎంపీపీ వెంకటరత్నమ్మ, ఎంపీటీసీలు సెల్వి, ఇంద్రాణి, బాలయ్య పలువురు పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని సోమవారం మాజీ పార్లమెంటు సభ్యులు కనుమూరి బాపిరాజు, గోకరాజు గంగరాజు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వీరికి దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారికి నిర్వహించిన అభిషేక సేవలో పాల్గొన్నారు. అనంతరం అంతరాలయ దర్శనం చేసుకుని... జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వచన మండపంలో వేద పండితులు వీరికి వేదాశీర్వచనం అందజేయగా... అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత లక్కమనేని మధు, టిడిపి నాయకులు మాజీ కౌన్సిలర్ రవీంద్రబాబు, ప్రోటోకాల్ ఏఈఓ మోహన్, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం, ఏపీఆర్‌ఓ శేఖర్ బాబు పాల్గొన్నారు.

అభాకాస్ పోటీల్లో శ్రీకాళహస్తి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జిల్లాస్థాయిలో తిరుపతిలో విశ్వం ఎడ్యుటెక్ వారు నిర్వహించిన మ్యాథ్స్ అభాకాస్ పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణం ఢిల్లీ పబ్లిక్ పాఠశాల, ఆర్ సి పి గురుకుల పాఠశాల విద్యార్థులు విశిష్ట ప్రతిభను కనబరిచారు. జిల్లా స్థాయి మొత్తం ఈ పోటీలలో వెయ్యి మంది విద్యార్థులు పాల్గొనగా ఆర్ సి పి పాఠశాల లో ఎనిమిదో తరగతి చదువుతున్న పాఠశాల విద్యార్థి జే.సంయుక్త మొదటి బహుమతి రాగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో చదువుతున్న ఏడవ తరగతి విద్యార్థిని పి హిమబిందు మ్యాక్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ద్వితీయ బహుమతి అందుకున్నారు. ఈ పోటీలలో సి.హెచ్ గుణ శ్రీ, భార్గవ్ కురెండవ బహుమతి లభించింది. అదేవిధంగా అభాకాస్ విజువలైజేషన్ ఢిల్లీ పబ్లిక్ పాఠశాల విద్యార్థి బి.నితిన్ కు ద్వితీయ బహుమతి లభించింది. విద్యార్థినీ విద్యార్థులు జిల్లాస్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి, శ్రీకాళహస్తి పట్టణానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చి చిరస్థాయిగా నిలిచారని వారిని ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు కె. ఢిల్లీ బాబు, సుప్రజ, ఉపాధ్యాయులు నాగేశ్వరి, బాలసుబ్రమణ్యం, షేక్ షకీల, అరుణ, రోజా అభినందించి ఘనంగా సన్మానించారు. వారితోపాటు వారి తల్లిదండ్రులు ఉన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని సోమవారం పలువురు న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు దర్శించుకున్నారు. ప్రముఖుల రాకతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్, కలకత్తా డెట్ రికవరీ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్, మాజీ జడ్జి జస్టిస్ శ్రీనివాస శ్రీవాత్సవ, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సి.వై. సోమయాజులు, జస్టిస్ రామకృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వీరితో పాటు ఎస్.పి.ఆర్.బి డైరెక్టర్ జనరల్ ఆర్.కె. మీనా కూడా ముక్కంటి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు దేవస్థానం అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ శ్రీనివాస శ్రీవాత్సవలు స్వామివారికి నిర్వహించిన అభిషేక సేవలో పాల్గొన్నారు. జస్టిస్ శ్రీనివాస శ్రీవాత్సవ, జస్టిస్ రామకృష్ణారెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి రాహు-కేతు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రముఖులందరూ అంతరాలయ దర్శనం ద్వారా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ వేద పండితులు వీరికి వేదాశీర్వచనం అందజేయగా... అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను, శేషవస్త్రాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ఏఈఓ మోహన్, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం, ఏపీఆర్‌ఓ రవి, శ్రీనివాసులు, దేవాదాయ శాఖ రిటైర్డ్ ఏడీసీ శంకర్ రెడ్డి, వన్ టౌన్ సీఐ ప్రకాష్ కుమార్, స్థానిక కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీబీసీ వెల్ఫేర్ అసోసియేసన్ నియోజకవర్గ అధ్యక్షులుగా బాలాజీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షుడుగా ఊరందూరు బాలాజీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో జిల్లా నాయకులు ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి తాను ఎల్లపుడూ కృషి చేస్తానన్నారు. బీసీలు అన్ని విధాల ఎదిగేందుకుతన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

అభాగ్యుల చెంత.. అపురూప వేడుక



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: నేటి యాంత్రిక జీవనంలో పుట్టినరోజు వేడుకలంటే హొటళ్లు, కేక్‌లు, ఆర్భాటాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. కానీ, శ్రీకాళహస్తికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అన్నలూరు శ్రీకాంత్ మాత్రం తన పుట్టినరోజుతో పాటు తన ముద్దుల కుమార్తె మోనశ్రీ జన్మదినాన్ని అభాగ్యుల చెంత జరుపుకుని ఒక గొప్ప సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. విశేషమేమిటంటే... తండ్రి శ్రీకాంత్, కుమార్తె మోనశ్రీ పుట్టినరోజు ఒకే రోజు కావడంతో, ఈ అరుదైన సందర్భాన్ని ఆదర్శవంతంగా మార్చుకోవాలని అన్నలూరు శ్రీకాంత్, మాధురి దంపతులు నిర్ణయించుకున్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ఎన్టీఆర్ ఉద్యానవనం సమీపంలో ఉన్న నిరాశ్రయుల ఆశ్రమంలో ఆశ్రమవాసుల మధ్య కేక్ కట్ చేసి ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలోని వారికి స్వయంగా విందు భోజనం వడ్డించి, వారి ముఖాల్లో చిరునవ్వులు నింపారు. అన్నలూరు శ్రీకాంత్ కు ప్రముఖ సంఘం సేవకులు యల్లంపాటి కోటేశ్వర బాబు స్వయానా మామ కావడం విశేషం. అన్నలూరు శ్రీకాంత్ కు యల్లంపాటి కోటేశ్వరబాబు ఆశీస్సులు మెండుగా ఉన్నాయి.సేవలోనూ.. ఉపాధిలోనూ మేటి: శ్రీకాళహస్తిలో రుచికి, శుచికి మారుపేరుగా నిలిచిన 'సింహపురి దాబా', ఇటీవల ప్రారంభించిన 'బృందావనం రూఫ్ టాప్ రెస్టారెంట్' ద్వారా శ్రీకాంత్ వ్యాపార రంగంలో తనదైన ముద్ర వేశారు. కేవలం లాభాపేక్షే ధ్యేయం కాకుండా, తన రెండు సంస్థల ద్వారా సుమారు 46 మంది కార్మికులకు ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తూ ఎన్నో కుటుంబాలకు అన్నదాతగా నిలుస్తున్నారు. వ్యాపారంలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ... సామాజిక బాధ్యతను మరువకుండా నిరాశ్రయుల మధ్య జన్మదినం జరుపుకోవడం పట్ల పట్టణ ప్రజలు, సామాజిక వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆత్మీయ వేడుకల్లో ఆశ్రమ నిర్వాహకులు యువకిషోర్, శ్రీకాంత్-మాధురి దంపతుల బంధుమిత్రులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో డిసెంబరు 30న వైకుంఠ ఏకాదశి, 31న వైకుంఠ ద్వాదశి పర్వదినాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. డిసెంబరు 30న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువఝామున 12.05 గంటల నుండి 2.30 గంట వరకు ధనుర్మాస కైంకర్యాలు, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. వేకువఝామున 2.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు రాత్రి కైంకర్యాలు తిరిగి 5 నుండి రాత్రి 9 గంటల వరకు భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. అదేవిధంగా డిసెంబరు 31న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 4 నుండి 5.30 గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు చక్రస్నానం నిర్వహిస్తారు. ఉదయం 6 నుండి 7 గంటల వరకు తిరుచ్చి ఉత్సవం జరుగనుంది. ఆంగ్ల నూతన సంవత్సరాది 2026 జనవరి 1న వేకువఝామున 1 గంట నుండి 4 గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. వేకువఝామున 4 నుండి సాయంత్రం 4 గంటల వరకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు రాత్రి కైంకర్యాలు, తిరిగి సాయంత్రం 5 నుండి రాత్రి 8.30 గంటల వరకు భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. ఈ రెండు పర్వదినాలను పురస్కరించుకుని టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆలయంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టిటిడి ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

భూముల రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-కోట: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రైతుల భూ సమస్యను పరిష్కరించేందుకు ప్రవేశపెట్టిన భూసర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ జయ జయ రావు, మండల సర్వేయర్ గోపిరెడ్డి పేర్కొన్నారు. కోట మండలం మద్దాలి రుద్రవరం గ్రామాల్లో సోమవారం భూముల రీ సర్వే కార్యక్రమంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 6 పంచాయతీలలో జనవరి 2 నుంచి భూముల రీసర్వే కార్యక్రమం జరుగుతుందని రైతులందరూ విధిగా రీసర్వే చేయించుకోవాలని తాసిల్దార్ కోరారు.అలాగేగత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫోటోతో వేసిన పట్టాదారు పుస్తకాలను మార్చి కొత్త పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. అధికారులతో పాటు, రెవిన్యూ సిబ్బంది, సర్వేయర్ గోపిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ర్యాంకుల ప్రభంజనం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన రెండవ సెమిస్టర్ ఫలితాల్లో పట్టణానికి చెందిన ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాంకుల ప్రభంజనం సృష్టించారు. యూనివర్సిటీలోని అన్ని గ్రూప్‌ల్లో అగ్రస్థానాలను కైవసం చేసుకునానరు. బీఎస్సీ (హానర్స్) కంప్యూటర్ సైన్స్ గ్రూపులో యం.లహరి (8.83) పి.శిరీష (8.73) ఎ. వైష్ణవి (8.70) నందు పాయింట్లతో యూనివర్సిటీ వరుసగా ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. బీఎస్సీ (బయోటెక్నాలజీ హానర్స్) గ్రూపులో టి. సుజాత (8.85) ఎ.చంద్రిక (8.13.) .కె. సిరి (7.96) పాయింట్లతో యూనివర్సిటీ వరుసగా ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. బీకాం (హానర్స్) గ్రూప్‌లో యస్.కె. మస్రత్ (8.75) డి. పూర్ణిమ (8.53) జి. సంతోష్ (8.51) పాయింట్లతో యూనివర్సిటీ వరుసగా ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ చెవిరెడ్డి. మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

చిరుధాన్యాల ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధికి బాటలు: శాస్త్రవేత్త దివ్య సుధ



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వ్యవసాయ అనుబంధ రంగాలలో నైపుణ్యం సాధించడం ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావచ్చని తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త బి.దివ్య సుధ పిలుపునిచ్చారు. సోమవారం శ్రీకాళహస్తి మండలంలో 'ఆత్మ' చిత్తూరు సహకారంతో, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో "వ్యవసాయ అనుబంధ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి - చిరుధాన్యాల ప్రాముఖ్యత" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య సుధ మాట్లాడుతూ... గత 32 ఏళ్లుగా కేవీకే అందిస్తున్న సేవలను వివరించారు. చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి, చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించడం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. అందుబాటులో ఉండే కూరగాయలతో పచ్చళ్లు, పండ్లతో శీతల పానీయాలు, పుట్టగొడుగుల పెంపకం వంటి అంశాలపై పట్టు సాధిస్తే ఆదాయ మార్గాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ అంశాలన్నింటిపై రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఉచితంగా శిక్షణ ఇస్తామని... మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రాస్ మహిళా ప్రగతి ప్రాజెక్ట్ ప్రతినిధి నాగరాజు మాట్లాడుతూ... గత 40 ఏళ్లుగా రాస్ సంస్థ చేపడుతున్న సామాజిక అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, రాస్ మహిళా ప్రగతి సిబ్బంది, మహిళా పొదుపు సంఘాల రైతులు పాల్గొన్నారు.

భూమి రీ సర్వే గ్రామ సభ

విశాలాంధ్ర-వరదయ్యపాలెం: వరదయ్యపాలెం మండలంలోని మరదవాడ గ్రామం మరియు కరిపాకం గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రవేశపెట్టిన రీ సర్వే విషయం పై తెలిపిన గ్రామాల్లో గ్రామసభ జరగడం అయినది ఇందులో గ్రామస్తులు భూమిపై పలు సమస్యలు ఉన్నవని తాసిల్దారు గారికి విన్నపించుకున్నారు వచ్చే సంవత్సరం 2026 రెండవ తేదీ జనవరి న రి సర్వే పూర్తిస్థాయిలో పై తెలిపిన గ్రామలలో ప్రారంభమవుతుందని గ్రామస్తులకు తెలియ చేసినారు వరదయ్యపాలెం తాసిల్దార్ సుధీర్ రెడ్డి సదరు విషయమై ప్రజలు అందరూ రీ సర్వేలో మీ యొక్క భూమి సరిహద్దులు చూపిమరియుభూసమస్యలను పరిష్కరించవలసిందిగాతెలియపరిచినారువరదయ్యపాలెం తాసిల్దార్ సుధీర్ రెడ్డి, మండల సర్వే వెంకట రమణయ్య, వీఆర్వోలు రవి రెడ్డి, మాధవి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర-రామాపురం: రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంగా కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. రామాపురంలో సోమవారం మండల నాయకులు కార్యకర్తలుతో భారీగా ర్యాలీ నిర్వహించి మూడు రోడ్లు కుండలి వద్ద నిరసన తెలియజేసి రోడ్డుపై టైర్లతో మంటలు వేసి మదనపల్లి వద్దు రాయచోటి ముద్దు అంటూ వినాదాలు నిర్వహించారు ఈ ర్యాలీ మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి స్వగృహం నుంచి పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా రాయచోటి అన్నమయ్య జిల్లాను కేంద్రంగా చేసి పరిపాలన సాగిస్తున్నారని అందరికీ అందుబాటులో ఉన్న అన్నమయ్య జిల్లా రాయచోటిని జిల్లా కేంద్రం చేశారని ఈ జిల్లాను మదనపల్లిలో కలపడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలను కలిపే ముందు ప్రజా వేదికలను సమాచారాన్ని ప్రజల నుండి సమాచారాన్ని సేకరించాలని ఏం లేకుండా మదనపల్లి జిల్లాగా ప్రకటించడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు దృష్టికి యువ నాయకులు, మంత్రినారా లోకేష్ దృష్టికి ఈ విషయం తీసుకొని వెళ్ళి అన్నమయ్య జిల్లా వుంచడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేందర్ రెడ్డి నాగబాసిరెడ్డి రమేష్ రెడ్డి ఉప సర్పంచ్ మహబూబ్ బాషా మండల ఎంఎల్ వెంకట్రాంరెడ్డి నాగభూషణ్ రెడ్డిసహదేవ రెడ్డి రేఖంబ్రదర్స్ ప్రతీప్ కుమార్ రెడ్డి బయారెడ్డి మానిటరింగ్ కమిటీ సభ్యుడు వెంకటరమణ అజం వినోద్ కుమార్ రెడ్డి మాజీ జడ్పీటీసి నాగ సుబ్బారెడ్డి హరి ప్రసాద్ భూత్ ఇంచార్జ్ చిట్టిరెడ్డి తిమ్మారెడ్డి వెంకట్రాం రాజుసుధాకర్ రామానుజుల రెడ్డి ధన లోకేష్ అన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలకు ప్రతిరూపం విశాలాంధ్ర: రమణారెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: విశాలాంధ్ర వాస్తవాలకు ప్రతిరూపమని ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ బి రమణారెడ్డి కొనియాడారు. వేంపల్లిలో సోమవారం ఉషాకిరణ్ పాఠశాలలో విశాలాంధ్ర దినపత్రి రూపొందించిన 2026 నూతన కేలండరును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాలు నిర్భయంగా రాయడంలో విశాలాంధ్ర దినపత్రిక దిట్ట అన్నారు. అలాగే కాలమానం ప్రకారం కేలండరు కూడా అద్భుతంగా ఉందని ప్రశంసించారు. కార్యక్రమంలో విలేకరి అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వం విఫలం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో 2025 సంవత్సరం విఫల సంవత్సరముగా తయారు కావడం దురదృష్టకరం, శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2025వ సంవత్సరంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక విధాలుగా వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ అధః పాతాళానికి పడిపోయింది. ఒక డాలర్ విలువ రూ 91.04. దీనివలన భారతీయ విద్యార్థులకు విదేశీ విద్య భారమైంది. భారత్ దిగుమతులపై ఆర్థిక భారం పడింది. పొరుగు దేశం, మిత్ర దేశం అయినటువంటి బంగ్లాదేశ్లో మోడీ పాలనలో అక్కడ ఉన్న హిందువులపై దాడులు జరగడం, వారు అభద్రతాభావం లో ఉండిపోవడం దురదృష్టకరమన్నారు. ఈ విధంగా ఏ కోణంలో చూసిన 2025 వ సంవత్సరం మోడీ పాలనలో విఫల సంవత్సరంగా తయారైంది. కనీసం 2026 నూతన సంవత్సరమైనా సఫల సంవత్సరం కావాలని ఆశిద్దామని తులసి రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపి రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, నాగరాజు, ఐచర్ రమణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట మున్సిపాలిటీని అభివృద్ధి చేయండి

బీజేపీ నాయకులు పట్టుపోగుల ఆదినారాయణ

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టు పోగుల ఆదినారాయణ అన్నారు. నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనారాయణ ను సోమవారం ఆయన చాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిసి శాలవాతో సత్కరించారు. అనంతరం శ్రీశైలం దేవస్థానం ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు కృషి చేయాలని, రాజంపేట మున్సిపాలిటీలో అనేక సమస్యలు ఉన్నాయని వారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా మురికి కాలువలు, రోడ్లు అనేక వీధుల్లో చెత్తాచెదారం రోడ్లపైనే వేయడం జరుగుతుందని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీ సమస్యలపై కమిషనర్ కూడా సానుకూలంగా స్పందించి రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వి. వినయ్ కుమార్, రాజశేఖర్ రెడ్డి, జయ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి :ఏఐటియూసి

విశాలాంధ్ర-కడప రూరల్ : విద్యుత్ సంస్థను నమ్ముకుని గత పది 15 సంవత్సరాల పనిచేస్తున్న మీటర్ రీడర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మీటర్ రీడర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి బాదుల్లా నగర కార్యదర్శి మద్దిలేటి మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గఫార్ బాషా లు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఒకపక్క ప్రజలు మరోపక్క ఉద్యోగులు ఉద్యోగ సంఘాలు వద్దంటున్న పాలక ప్రభుత్వాలు మీనవేశాలు లెక్క వేస్తూ కమిషన్లకు కక్కుర్తి పడటం మూలంగా మీటర్ రీడర్స్ కు ఉద్యోగ భద్రత కోల్పోతున్నారని ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్స్ కు వేతనాలు పీస్ రేటు కాకుండా ఎస్క్రో పద్ధతిలో వేతనాలు చెల్లించాలని అనే దఫాలుగా విజ్ఞతలు నిరసనలు తెలియజేసినప్పటికీ యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మీటర్ రీడర్స్ యూనియన్ కార్యదర్శి కిరణ్ కుమార్ ఉపాధ్యక్షులు రమణ సహాయ కార్యదర్శి జోసెఫ్ లక్ష్మీనారాయణ కోశాధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ పాఠ్య ప్రణాళిక సంఘం సభ్యులుగా ఆచార్య టి రామప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలోని తెలుగుశాఖ ఆచార్యులు తప్పెట రామప్రసాద్ రెడ్డి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం లోని విదేశీ భాషలు, భాషాశాస్త్రం విభాగానికి చెందిన పాఠ్య ప్రణాళిక సంఘం సభ్యులుగా నియమితులయ్యారు. ఆచార్య రామప్రసాద్ రెడ్డి గతంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మద్రాస్ విశ్వవిద్యాలయం,కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం,రాయలసీమ విశ్వవిద్యాలయం, కృష్ణా విశ్వవిద్యాలయం, శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయం అలాగే వివిధ స్వయం ప్రతిపత్తి డిగ్రీ కళాశాల తెలుగుశాఖలకు పాఠ్య ప్రణాళిక సంఘం సభ్యులుగా నియమితుల య్యారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,బెంగుళూరు విశ్వవిద్యాలయం,ద్రావిడ విశ్వవిద్యాలయం,శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, మద్రాస్ విశ్వవిద్యాలయం కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం బోధన సిబ్బంది నియామక సభ్యులుగా (బి.వొ.ఎ) కూడా గతంలో నియమితులయ్యారు. బివోయస్ సభ్యులుగా నియమితులైన ఆచార్య రామప్రసాదరెడ్డిని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ ,వివిధ శాఖల ఆచార్యులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి

జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్దీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీ-ఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు మీకు వచ్చిన అర్జీలను సమయం కేటాయించి రివ్యూ చేయా లన్నారు. ఎవరైనా అర్జిలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు.అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

బిటెక్ రవి అంటే బోగస్.. ఆయన మాటలు కూడా అంతే బోగస్

- ఏడాది ఆరంభంలోనే ముగ్గురాయి దోపిడీ - నాటి నుండి నేటి వరకు ఇసుకనూ వదల్లేదు - బిటెక్ రవి వ్యాఖ్యలపై అవినాష్ రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి వ్యాఖ్యల పట్ల కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆయన పేరు ముందుండేది బోగస్ ఆయన మాటలు కూడా అంతే బోగస్ అన్నారు. ఏడాది పాలన సంతృప్తిని ఇచ్చిందని బీటెక్ రవి ఏ విధంగా చెబుతున్నారో తనకుగానీ ప్రజలకు కానీ అర్థం కాలేదన్నారు. 2025 సంవత్సరం ఆరంభంలోనే సంక్రాంతి నాటికి సుమారు 10 కోట్లు విలువైన ముగ్గురాయిని రాత్రికి రాత్రే తస్కరించిన ఘనత బీటెక్ రవికి దక్కుతుందని ఎద్దేవా చేశారు. అలాగే నాటినుండి నేటి వరకు ఇసుకను తవ్వుకుంటూనే అక్రమ రవాణా సాగిస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీలు సమస్యలను లేవనెత్తడం సహజమన్నారు. కానీ సమస్యలు వివరిస్తే పరిష్కరించకుండా నాలుగు దశాబ్దాల చరిత్ర అంటూ వ్యంగ్యంగా మాట్లాడటం మంచిది కాదన్నారు. 18 నెలల కాల వ్యవధిలో ఇంతవరకు కూటమి ప్రభుత్వం చేసింది శూన్యం అన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక నిర్వహణ ఖర్చులు ఎక్కువ కావడంతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తాగునీరు అందించాలన్న సంకల్పంతో సుమారు రూ.480కోట్ల వ్యయంతో వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పులివెందుల పట్టణంలో సుమారు పదివేల ఇళ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. వీటితోపాటు అనేక ప్రాంతాలలో తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డికి చెందిన రాంకీ సంస్థ ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. అయితే బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని. వీటి కోసం రాంకీ సంస్థ హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చిందన్నారు. కానీ ఇళ్లకు సంబంధించిన పులివెందుల వరకు బిల్లులు దాదాపు పూర్తయ్యాయని మరికొంత అదనంగానే చెల్లించామన్నారు. ఈ విషయాన్ని హౌసింగ్ ఎండి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. పులివెందుల వరకు బిల్లులు పూర్తయ్యాయని హౌసింగ్ ఎండి ఒక అఫీడవిట్ వేస్తే స్టేని కోర్టు వేకేట్ చేస్తుందన్నారు. రేషన్ సక్రమంగా కాలేదంటూ ఇటీవల కాలంలో మున్సిపల్ చైర్మన్ తో పాటు మరికొంతమంది కౌన్సిలర్లు ఆర్డీవోను ఆశ్రయించారన్నారు. ఈ విషయాన్ని కూడా బిటెక్ రవి రాజకీయం చేశారని ఆరోపించారు. ప్రతి విషయానికి 40ఏళ్ల చరిత్ర అంటూ వైఎస్ కుటుంబ సభ్యులను విమర్శించడం మంచిపద్ధతికాదన్నారు. ఈ 18 నెలల కాల వ్యవధిలో తమపై విమర్శలు చేయడం తప్ప బిటెక్ రవి చేసింది శూన్యం అన్నారు. ఇకనైనా బీటెక్ రవి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వేముల మండల వైసీపీ కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి పాల్గొన్నారు

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. పట్టణ పరిధిలో శ్రీ రంగనాథ స్వామి ఆలయం, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం, శ్రీవారి ఆలయంలలో ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాటు సిద్ధం చేశారు.

ఏకాదశి విశిష్టత:

పుష్యమాస శుక్లపక్ష ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అంటారు. ఈ రోజున విష్ణుమూర్తి ముక్కోటి దేవతలతో కలిసి భూలోకానికి విచ్చేసి భక్తులకు దర్శనమిస్తాడు కాబట్టి ముక్కోటి ఏకాదశి అని కూడా అంటారు. ఈ పుణ్య దినాన విష్ణాలయాల్లో ఉత్తర ద్వారం తెరిచి ఉంచుతారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను ఉపదేశించింది, క్షీరసాగర మథనం జరిగి హాలాహలం, అమృతం ఉద్భవించింది ఈ రోజునే. పూజలు, హెూమాలు, ఉపవాస, జాగరణలకు అధిక ఫలం చేకూర్చే రోజిది. వరిబియ్యంలో దాగివున్న మురాసురుణ్ణి సంహరించింది వైకుంఠ ఏకాదశి నాడేనని పురాణాలు పేర్కొన్నాయి. అందువల్ల ఈ ఏకాదశి నాడు బియ్యంతో చేసిన ఏ పదార్థాలనూ తినకూడదంటారు. ఈ రోజున ఉపవాసం ఉంటే ఏడాదిలోని అన్ని ఏకాదశులూ ఉపవాసం పాటించినట్టేనన్నది పురాణ వచనం. ముర అంటే తామసిక గుణాలకు, అరిషడ్వర్గాలకు ప్రతీక. వీటిని ఉపవాస జాగరణల ద్వారా జయిస్తే సత్వ గుణం లభించి తద్వారా ముక్తికి మార్గం ఏర్పడుతుంది. ద్వాదశినాడు అన్నదానం చేసిన వారు పాప విముక్తులవుతారు. ఉప అంటే దగ్గరగా, వాసం అంటే ఉండటం. దైవానికి దగ్గర కావాలనేదే ఉపవాసంలోని అంతరార్థం. పూజ, జపం, ధ్యానం లేదా ఉపాసన మొదలైన సాధనల ద్వారా మనసును శ్రీహరిపై లగ్నం చేస్తే ఉత్తమ ఫలితాలు కలుగుతాయి. ఈ పుణ్యదినాన చెడు పనులు, అబద్ధాలు, దురాలోచనలకు దూరంగా ఉండాలి. బ్రహ్మచర్యం పాటించాలి. అప్పుడే శ్రీహరి అనుగ్రహం కలుగుతుంది. ముక్కోటి ఏకాదశి రోజున నియమనిష్ఠలతో పూజించినవారికి పుణ్యఫలంతో పాటు కార్యసిద్ధి కలిగి మోక్షం ప్రాప్తిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

ఎస్పీ గారూ ! మాకు న్యాయం చేయండి

మునగల రమణమ్మ విన్నపం



విశాలాంధ్ర-కడప రూరల్ : 2025 నవంబర్ 27న తెల్లవారుజామున తెలుగు గంగ కాలనీ వనిపెంట రోడ్డులో ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న పూసల కులానికి చెందిన నా భర్త ఎలక్ట్రిషన్ మునగల వెంకటరమణ సైకిల్ పై వెళుతుండగా వనిపెంట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఈశ్వరమ్మ వాహనం ఢీకొట్టడంతో మునగల వెంకటరమణ అక్కడికక్కడే చనిపోయారు. చనిపోయి నెలరోజులైనా నష్టపరిహారం చెల్లించి బాధ్యులపై చర్యలు తీసుకోలేదు. వెంకటరమణను యాక్సిడెంట్ చేసింది ఫారెస్టు వారిదని తెలిసి కూడా మైదుకూరు సిఐ గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చనిపోయాడని మైదుకూరు సీఐ తప్పుడు స్టేట్మెంట్ రికార్డు చేశారు. వెంటనే బండి సీట్ చేసి, డ్రైవర్ను అరెస్టు చేసి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఈశ్వరమ్మ పై చర్యలు తీసుకోవాల్సిన సీఐ రమణారెడ్డి ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తూ బాధితులు బ్రతిమలాడిన పట్టించుకోకుండా న్యాయం చేస్తానంటూ మభ్యపెడుతూ వచ్చారు. దీనిపై సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర సీఐతో, డిఎఫ్ఓతో, ప్రస్తుత ఫారెస్టు రేంజర్‌తో మాట్లాడిన కూడా ఫలితం లేదు. ఫారెస్ట్ అధికారులు డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల యాక్సిడెంట్ జరిగింది అన్న కోణంతోనే కేసు సెటిల్మెంట్ కూడా డ్రైవర్ చేసుకోవాలంటూ ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ బాధిత కుటుంబాన్ని కనీసం మనిషిగా కూడా చూడకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. యాక్సిడెంట్ చేసిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఈశ్వరమ్మ ఇన్సూరెన్స్ లేని వాహనాన్నీ వినియోగించడమే కాకుండా, యాక్సిడెంట్ అయిన తరువాత చనిపోయిన వారి కుటుంబ బాధితులను కనీసం పరామర్శించకుండా పారిపోవడం విచారకరం. ఇన్సూరెన్స్ లేని వాహనాలు ఏ విధంగా వినియోగిస్తారన్న సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రశ్నకు ప్రస్తుత ఫారెస్ట్ రేంజర్ రాష్ట్రంలో ఫారెస్ట్ వాహనాలకు షో రూమ్‌లో చెల్లించిన మొదటి ప్రీమియం మినహా తిరిగి ప్రీమియం చెల్లించడం దాఖలాలు లేవన్నారు. మైదుకూరు సిఐ కూడా ఫారెస్ట్ వాహనాలకే కాదు పోలీసు వాహనాలకు కూడా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించట్లేదని చెప్పారన్నారు. రాష్ట్రంలో పోలీసులు, ఫారెస్ట్ అధికారుల వాహనాలకు ఇన్సూరెన్స్, పర్మిట్లు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు, పొల్యూషన్ నుండి మినహాయింపు ఏమైనా ఉన్నదా అని ప్రశ్నించారు. అధికారులు అధికార పార్టీ నేతలు వెనుకబడిన కులాలకు చెందిన మునగల వెంకట రమణ లాంటి వారి ఆక్సిడెంట్ కనీసం జంతువు కంటే హీనంగా పరిగణిం చడం దుర్మార్గం. యాక్సిడెంట్ చేసిన వాహనానికి ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించబడి ఉండి ఉంటే మృతుని కుటుంబం ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా పరిహారం పొందే అవకాశం ఉండేదని అధికారుల బాధ్యతారాహిత్యం నిర్లక్ష్యం వల్ల ఆ అవకాశం కోల్పోవలసి వచ్చింది. యాక్సిడెంట్‌లో చనిపోయిన మునగల వెంకటరమణ సంపాదనపై ఆధారపడి జీవిస్తున్న భార్య, పిల్లలు వీధిన

వేతనాలు అందక కార్మికులకు కష్టాలు : ఏఐటీయూసీ



విశాలాంధ్ర-కడప రూరల్ : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్సు నైట్ వాచ్మెన్లు మధ్యాహ్న భోజన పథక కార్మికులు అక్టోబర్ నవంబర్ మాసాలు సంబంధించిన వేతనాలు చెల్లించాలని సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కడప కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెసి. బాదుల్లా మధ్యాహ్న భోజన పథకం వర్కర్ యూనియన్ గౌరవాధ్యక్షులు చాంద్ బాషా నగర కార్యదర్శి ఉద్దె మద్దిలేటిలు మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని పెద్దపీట వేస్తున్నామని మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు. చిరు కార్మికులైన స్వీపర్సు నైట్ వాచ్మెన్లకు నెలకు 6000 రూపాయల వేతనం మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు 3000 వేతనం నాము మాత్రం అయినా రెండు నెలలు మూడు నెలలు పెండింగ్లో ఉంచితే కుటుంబాలు ఎట్లా గడవాల అని ప్రశ్నించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లింగన్న మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా కార్యదర్శి సులోచనమ్మ నాయకురాలు లక్ష్మీదేవి రమణ మస్తానీ భాషా స్కూల్ స్లిప్పర్స్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గౌసియా నాగలక్ష్మి కుమారి నైట్ వాచ్మెన్ యూనియన్ జిల్లా కార్యదర్శి నరసయ్య మురళి గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికడదాం

విశాలాంధ్ర-పులివెందుల: ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్ ప్రమాదాలు అరికడదామని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో సోమవారం 6 వ రోజు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం పురస్కరించుకుని రోడ్ ప్రమాదాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గాంధీ కూడలి నుండి ప్రారంభమైన ర్యాలీ పోలీస్ స్టేషన్, పాత ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా పూలంగళ్ల వరకు సాగిన ర్యాలీలో సెల్ ఫోన్ వద్దు-ప్రాణాలు ముద్దు, బైక్ ప్రయాణంలో హెల్మెట్, కారు ప్రయాణాలలో సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్ లు చూసుకుని నిబంధనలు పాటించండి రోడ్డు ప్రమాదాలు అరికట్టండి నినాదాలతో హెూరెత్తించారు ఆటోలలో పరిమితి మించి ప్రయాణికులతో ప్రయాణం ప్రమాదం అని, మద్యం సేవించి వాహనాలు నడపరాదంటూ అవగాహన కల్పించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

విశాలాంధ్ర-తొండూరు: తొండూరు పోలీస్‌స్టేషన్‌ను సోమవారం పులివెందుల రూరల్ సిఐ రమణ తనిఖీ చేశారు. అంతకు ముందు ఇనగలూరు గ్రామాన్ని సందర్శించారు. అక్కడ పోలీస్ పికెటను పరిశీలించామని సిఐ తెలిపారు. అక్కడ వర్గనాయకులకు సూచనలిచ్చామన్నారు. ఎటువంటి ఘర్షణలకు తావివ్వకుండా ఉండాలని వర్గనాయకులకు సూచనలు ఇచ్చామన్నారు. ప్రతి ఒక్కరూ శాంతియుత జీవనం సాగించడమే పోలీస్‌యంత్రాంగం ఉద్దేశమని రమణ వెల్లడించారు.

రైస్ కుక్కర్లు పంపిణీ

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక వికలాంగుల కమ్యూనిటీ భవనంలో సోమవారం సుమారు 20 మంది దివ్యాంగుల కుటుంబాలకు రైస్ కుక్కర్లు పంపిణీ చేశారు. సింహాద్రిపురం మండల వైసిపి ఇన్‌చార్జి దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి మాతృమూర్తి దివంగత లక్ష్మీనరసమ్మ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సేవాస్ఫూర్తిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి బావ సారెడ్డి కృష్ణారెడ్డి, వారి సహచరులు సురేష్ నాయక్, పార్నపల్లె నాయుడు, ఎర్రగుడిపల్లె కౌన్సిలర్ బొగ్గిటి పురుషోత్తం, వైసిపి నేత, చేనేత విభాగం అధ్యక్షులు ఈశ్వరయ్య, అరుణ్, వాసు పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన టిడిపి నాయకులు

విశాలాంధ్ర-పెద్దముడెం : మండలంలో కొత్తగా ఎస్సై బాధ్యతలు స్వీకరించిన పి. శ్రావణిని మర్యాద పూర్వకంగా తెలుగుదేశం మండలాధ్యక్షుడు జిట్టా రమణా ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి ఆయన సోమవారం మండలంలో కొత్తగా విధులు నిర్వహిస్తున్న సందర్భంగా ఆమెకు శాలువా కప్పి ఆమెను సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : అధికారులకు ఆర్డీవో సూచన

విశాలాంధ్ర-తొండూరు: రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవో చిన్నయ్య అధికారులకు సూచించారు. సోమవారం తొండూరులోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ బి.రామచంద్ర అధ్యక్షతన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు,ప్రజలు పలు సమస్యలపై ఆర్డీఓకు వినతులను సమర్పించారు. రైతుల సమస్యల పట్ల అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ రామకృష్ణారెడ్డి,మండల సర్వేయర్ రాఘవేంద్ర,ఆర్ఐ నాగరాజు,వీఆర్వో మధుసూదన్,రైతులు పాల్గొన్నారు.

16 వ రోజుకు చేరుకున్న రిలే నిరాహారదీక్షలు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాజంపేట ను జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ టోల్ గేట్ దగ్గర ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఇజెఎసి, జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారానికి 16 వ రోజుకు చేరుకున్నాయి.రిలే నిరాహారదీక్షల్లో బొజ్జావారిపల్లి గ్రామస్తులు దాడిశెట్టి సుదర్శన్ (సిద్దూ),మావిళ్ల సుబ్బయ్య, సుబ్రమణ్యం,మధు, హరికృష్ణ, కొమ్మా తిరుమల ప్రసాద్,మణి, కార్తిక్ ,తుపాకుల వెంకటసుబ్బయ్య, సిద్దంశెట్టి మల్లిఖార్జున, బొక్కసం మహేష్ తదితరులు రిలే నిరాహార దీక్షల్లో కూర్చోన్నారు.ఇజెఎసి, జెఎసి సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో తాతంశెట్టి నాగేంద్ర, పోతురాజు నవీన్,నార్జాల హేమ రాజ్, సిహెచ్ రమేష్ బాబు, పోకల మణి, అంకిపల్లె భువనేశ్వర్, మారెళ్ల రామకృష్ణ, సుమంత్, ముత్యాల పెంచలయ్య, ఎస్ఎన్ శ్రీనివాసులు,ఎ నరసింహారెడ్డి,పి రాజశేఖర్,ఎంవి కుమార్, ఎస్ సుధర్శన్ రెడ్డి, సుకుమార్, చంగల్ రాజు, తులసి, విద్యార్థులు పాల్గొన్నారు.

జల్లికట్టు కార్యక్రమాన్ని నిలిపివేయాలి

కలెక్టర్‌ను కోరిన గ్రామస్తులు

విశాలాంధ్ర - చంద్రగిరి: జనవరి 1న చంద్రగిరి మండలం శానంబట్ల గ్రామంలో నిర్వహించే జల్లికట్టు కార్యక్రమాన్ని నిలిపివేయాలి లేదా ఊరికి దూరంగా అనువైన ప్రదేశానికి తరలించాలని ఆ గ్రామస్తులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ను కోరారు. గ్రామంలో నిర్వహిస్తే తలెత్తే సమస్యలు, నష్టాలను వివరించుతూ జిల్లా కలెక్టర్‌కు పి.జి.ఆర్.ఎస్ ద్వారా అర్జీ సమర్పించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు, వాహనాలు రావడం వల్ల ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాలు, వృద్ధులు, మహిళలు, పిల్లలకు భద్రతా సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని జల్లికట్టు సమయంలో ఎద్దులు ఆవులు అదుపు తప్పితే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. గతంలో జరిగిన గాయాలు, ఆస్తి నష్ట ఘటనలను అర్జీలో గ్రామస్తులు పొందుపరచారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ప్రజారోగ్యం, ప్రజల భద్రత దృష్ట్యా గ్రామంలో జల్లికట్టు నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యామ్నాయంగా జనావాసాలకు దూరంగా వేరే ప్రదేశంలో నిర్వహించాలని వారు జిల్లా పాలనాధికారికి వినతిపత్రం అందించి తమ వినతి పై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.

రోడ్డుకు అడ్డుగా ఉన్న ఫ్లెక్సీలు తొలగించండి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలో ఏఐవైఎఫ్ పట్టణ కన్వీనర్ ఏ సాయి కుమార్ ఆధ్వర్యంలో భ్రమరాంబ థియేటర్ మెయిన్ రోడ్డు మధ్యలో ఏర్పాటుచేసిన సినిమా ఫ్లెక్సీ వల్ల వెంకటగిరి ప్రజలు రోడ్డు దాటేటప్పుడు యాక్సిడెంట్స్ జరుగుతున్నాయి. ప్రజలకు ఇబ్బంది కలిగించే రోడ్డు మధ్యలోని ఫ్లెక్సీలను తొలగించాలని వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ పట్టణ కన్వీనర్ ఏ సాయికుమార్ సభ్యులు ఎల్ సెల్వ కుమార్, డి సాయిరాం, రమేష్, హరి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కంటి ఆధ్వర్యంలో అల్పాహారం వితరణ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ రొటేరియన్ శ్రీకంటి రామ్మోహనరావు దాతృత్వంతో పదో తరగతి విద్యార్థినిలకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులందరూ చక్కగా చదువుకొని పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను కనబరిచి,తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని, ఈ అల్పాహారమును మూడు రోజుల పాటు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాఘవరెడ్డి, సీనియర్ రొటేరియన్ పి.ఎమ్ రావు, వాసు గౌడ్, నందిమండలం కృష్ణంరాజు, చోళవరం గిరిబాబు, కోదండ రామయ్య, బొమ్మిడి శ్రీనివాసులు, హెచ్ఎం యానాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులో వినియోగదారుల పడిగాపులు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: కుటుంబ అవసరాల నిమిత్తం నగదు కోసం వెళ్ళిన వినియోగదారులకు చేదు అనుభవం ఎదురయింది మండల కేంద్రంలోని ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ లో సోమవారం బ్యాంకు లో నగదు కొరత వల్ల డబ్బు విత్ డ్రా చేసుకోవడానికి కష్టమర్లు పడుగాపులు కాచారు. బ్యాంకులో నాగతో సరఫరా లో జాప్యం చేసుకోవడం వల్ల ఖాతాదారుడు తన ఖాతాలో ఉన్న డబ్బులు తీసుకోవడానికి సుమారు పది గంటలకి వెళ్లినటువంటి ఖాతాదారుడు మధ్యాహ్నం మూడు గంటల వరకు పడి కాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది ల.మరి కొంతమంది ఖాతాదారులు నగదు కొరత ఏర్పడడంతో నెఫ్ట సహాయంతో ఇతర బ్యాంకు ఖాతాలోకి నగదు బదిలీ చేసుకున్నారు, సిబ్బంది కాస్త ఖాతాదారులపై నిర్లక్ష్య వైఖరి చూపారు. కొంతమంది మధుమేహ వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడ్డారు.బ్యాంకు ఎదుట కొంతమంది బ్యాంకు మిత్ర ద్వారా వ్యక్తుల ద్వారా కొంతమేరకు నగదు అందిస్తున్నారు. బయట వ్యక్తులకి అధికారులకి ఉన్న అవినాభావ సంబంధాల వలన ఇంకాస్త ఆలస్యం అవుతున్నది. అక్షర జ్ఞానం లేనివారు, సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడం ద్వారా రద్దీని తగ్గించే ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ. నగదు రహిత లావాదేవులు జరగటం లేదు.

ప్రజా సమస్యా పరిష్కారమే జనసేన జనవాణి

విశాలాంధ్ర - పుంగనూరు: ప్రతి వారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరుగు జనవాణి కార్యక్రమాన్ని నియోజకవర్గ జనసేన నాయకులు కోలాసోమ శేఖర్ ఇన్చార్జ్ సిరివేలు చిన్నా రాయల్ ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగింది. జనవాణిలో వచ్చిన కొన్ని సమస్యలును అధికారులు తెలియజేసి అప్పటికప్పుడే పరిష్కరించడం జరిగింది, ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ ముఖ్యంగా పుంగమ్మ చెరువు కట్టదగ్గర ఉన్న శనీశ్వరుని గుడి దగ్గర గుంతలెక్కువ వున్నాయని మా దృష్టికి రావడం జరిగినది దానికొరకు పంచాయతీ సెక్రటరీతో మాట్లాడి కొంత నిధులు కేటాయించి రోడ్డు మరమత్తులు చేయాలని కోరడం జరిగినది. సదుం మండలం జోగివారిపల్లి పంచాయతీ నాయనవాణిపల్లి నుండి దామలచెరువు అడవిలో రోడ్డు మార్గం కల్పించాలని డి.ఎఫ్.ఓ. కి విన్నవించడం జరిగినది. నెక్కొంది పంచాయతీ, ఇటికనెల్లూరు గ్రామంలో గతంలో నిర్మించి డ్రైనేజి కాలువ సమస్య చిన్న పిల్లలు ఆడుకుంటూ పడిపోతున్నారు డ్రైనేజి కాలువ లో వాటర్ సరిగా ఫ్లో అవ్వడం లేదు ఎమ్.డి.ఓ. దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు గాజుల నరేష్, స్టేట్ మోదీలియర్ డైరక్టర్ మణికంఠ, పట్టన ఉపాధ్యక్షులు నందు, నాయకులు రవి, భార్గవ్, శీనా, గణపతి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి సందర్భంగా చిన్న పిల్లలు, వృద్ధులు తప్పిపోకుండా ఉండేందుకు తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., గారి ఆదేశాల మేరకు తిరుమలలో జియో ట్యాగ్ విధానం అమలు చేయడంతో పాటు, ప్రత్యేక అధికారులు మరియు మహిళా సిబ్బందిని నియమించడం జరిగింది.- ఈ క్రమంలో ఈరోజు తిరుమలలోని బీడీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద దర్శనార్థం వచ్చిన కౌశిక్ (వయస్సు 5 సంవత్సరాలు) అనే బాలుడు తప్పిపోయినట్లు తండ్రి వెంకటేష్, పెర?ంబట్టు (తమిళనాడు రాష్ట్రం) పోలీసులకు సమాచారం అందించారు.- పోలీసులు తక్షణమే స్పందించి, బాలుడికి ముందుగా కట్టిన జియో ట్యాగ్ ఆధారంగా అతని స్థలాన్ని గుర్తించి, సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.- ఈ చర్యపై బాలుడి తల్లిదండ్రులు మిక్కిలి సంతోషం వ్యక్తం చేస్తూ, తిరుపతి జిల్లా పోలీస్ శాఖను అభినందించారు.

ముగిసిన బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్

విశాలాంధ్ర - తిరుపతి: ఫ్యాషన్ కళకు తెలిసిన పద్ధతులను అధిగమించి ఒక కొత్త అమోఘమైన కథను సమర్పిస్తూ నిర్వహించిన బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ ఈ సంవత్సరం ఎడిషన్ ను ముగిసిందని పెర్నాడ్ రికార్డ్ ఇండియా సీఎంఓ దేబ్రాశ్రీ దాస్ గుప్తా తెలిపారు. ఫ్యాషన్ టూర్ ముగింపు సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్డిసిఐ) సహకారంతో, ఈ ప్రదర్శన కళా పనితనం, ఆధునిక టైలరింగ్, మెటాలిక్ జోక్యాలు విశ్వంతో ప్రేరేపించబడిన గ్రాఫిక్స్ ద్వారా పునః కూర్పు చేసిందన్నారు. "ఫ్యాషన్, సాంస్కృతిక సంభాషణలను తీర్చిదిద్దడంలో బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ ఎల్లప్పుడూ ప్రథమ స్థానంలో ఉంటుంది. ఈ ఎడిషన్ అంతిమ అధ్యాయంగా, ఫ్యాషన్ ను వాస్తవంగా పరివర్తనంగా మార్చే నిజమైన సారాంశాన్ని అందించిందన్నారు. ఎఫ్డిసిఐ చైర్మన్ సునీల్ శేథీ మాట్లాడుతూ ఎఫ్డిసిఐ బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ తో సహకారంపై ఆనందంగా ఉంది, ఈ సహకారం ద్వారా ఫ్యాషన్, రెండు శక్తివంతమైన దిగ్గజాలను ఏకం చేసి దాని భవిష్యత్తును రూపొందిస్తుంది సృజనాత్మకత, సంస్కృతిలను సంబరం చేసింది, భారతదేశపు ఫ్యాషన్ లో రాబోయే ట్రెండ్ కోసం మార్గం ఏర్పాటు చేసిందన్నారు. దీన్ని ఆదరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు."

కాణిపాకంలో శ్రీ స్వామి వారి నిత్య కళ్యాణం

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతల పట్టు నియోజకవర్గ ఐరాల మండలం ,శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నందు బుధవారం ఉదయం వినాయక స్వామి కళ్యాణోత్సవం జరిగినది. చూడటానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించారు .ఆలయ అర్చకులు అగ్ని హెూమం వేసి పూజలు నిర్వహించారు. వినాయక స్వామికి సంబంధించిన వేదమంత్రాలు చదివి భక్తులను ఆకట్టుకునే విధంగా కళ్యాణోత్సవం చేశారు. భక్తులు ఆచార ప్రకారము వినాయక స్వామికి కల్యాణోత్సవం జరిపిస్తే తమ కుటుంబం బాగుంటుందని ఉద్దేశం పెళ్లి గాని పిల్లలకు ఏమైనా దోషాలు ఉంటే తెలుగుపోయి పెళ్లి జరుగుతుందని కళ్యాణ ఉత్సవం జరిపించుకుంటారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గణేష్‌స్వామి వేద పండితులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభాల పంట :మార్కెట్ కమిటీ చైర్మన్

విశాలాంధ్ర - రామకుప్పం : రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు ఆస్కారం ఉందని కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జీఎం రాజు పేర్కొన్నారు సోమవారం మండల కేంద్రమ్కెన మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ని స్త్రీ శక్తి భవన్ లో ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ కూరగాయల సాగులో ప్రకృతి సేంద్రియ ఎరువులు వాడకం వల్ల కషాయం వాడకంతో పండించే పంటలతో ప్రజల ఆరోగ్యానికి సైతం మంచిదని అదేవిధంగా దీంతో అధిక దిగుబడి సాధించి రైతులు లాభాలు పొందాలన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గంలో కూరగాయల సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని త్వరలో మినీ ఎయిర్ స్ట్రిప్ నిర్మాణంతో ఇతర దేశాలకు ఎగుమతి చేసుకుని రైతులు ఆర్థిక అభివృద్ధి చెందుతారని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ మండలాధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సీతాపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రైతులు హార్టికల్చర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి-లారీ డ్రైవర్ అరెస్ట్

విశాలాంధ్ర - గుడిపాల :సోమవారం ఉదయం సుమారు 8.15 గంటల సమయంలో కొత్తపల్లి గ్రామంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన నేషన్ (65), తండ్రి దేవపచాన్ అనే వృద్ధుడు ఈ ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే నేషన్ ఈరోజు ఉదయం సుమారు 7 గంటలకు తన ఇంటి నుంచి బయలుదేరి ముత్తుకూరు వారి పల్లి వద్ద ఉన్న గోకులం హెూటల్‌లో టీ తాగి తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతూ నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో సుమారు 8.15 గంటలకు కొత్తపల్లిలోని రఘునాథన్ ఇంటి ముందు, వేలూరు వైపు నుంచి వచ్చిన ఒక లారీని డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి నేషన్‌ను ఢీకొట్టాడు. అనంతరం లారీని ఆపకుండా అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ప్రమాదంలో నేషన్‌కు తలకు తీవ్ర రక్తస్రావం కాగా, రెండు చేతులు విరిగాయి. తీవ్ర గాయాల కారణంగా ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హిట్ అండ్ రన్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా హైవేపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీని ఆధారంగా తీసుకుని ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించారు. అనంతరం లారీతో పాటు డ్రైవర్‌ను పట్టుకుని అతడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో కొత్తపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పిజిఆర్ఎస్ పిటిషన్లను సకాలంలో క్లోజ్ చేయాలి:తహశీల్దార్

విశాలాంధ్ర-కార్వేటినగరం: : పిజిఆర్ఎస్ పిటీషన్లను సకాలంలో క్లోజ్ చేయాలని తాసిల్దార్ కే నాగరాజు తెలియజేశారు ఈ మేరకు తాసిల్దార్ కార్యాలయంలో విఆర్ వోలు మరియు విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు పి జి ఆర్ ఎస్ పిటిషన్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి పిటిషనర్లకు న్యాయం చేయాలని సకాలంలో పిటిషన్లని క్లోజ్ చేయడంతో పాటు పిటీషనర్ కి ఎండామెంట్లు ఇచ్చి రీ ఓపెన్ కి అవకాశం లేకుండా వారిని సంతృప్తి పరచాలన్నారు అలాగే ఏపీ సేవ మీ సేవ వాటర్ టాక్స్ కి సంబంధించి పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు క్యాస్ట్ సర్టిఫికెట్ నుండివరకు అన్నింటిని గడువుకు ముందే క్లోజ్ చేయాలన్నారు జనవరి ఒకటో తేదీ నుండి ఏ ఒక్క సర్టిఫికెట్ గడువు తర్వాత పూర్తి చేస్తే అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు లేకుండా జరుగుతుందని హెచ్చరించారు మండలంలో గ్రావెల్ ఇసుక రవాణాకి మనమెవ్వరు అనుమతులు ఇవ్వలేదని అక్రమంగా రవాణా కాకుండా వీఆర్వోలు వీఆర్ఏలు ప్రత్యేక నిఘా ఉంచాలని అలా చేస్తే వారిపై కఠిన చర్యలు గైకొంటామని హెచ్చరించారు ప్రతి ఉద్యోగి ప్రతిరోజు సచివాలయాలకి సంబంధించిన లాగిన్లను పరిశీలించి గడువుకు ముందే అన్నింటిని క్లోజ్ చేసేందుకు సహకరించాలని సూచించారు ఈ సమావేశంలో తాసిల్దారులు లోకేష్ యాదవ్ స్వరూపరాణి మండల సర్వేయర్ మార్ కొండయ్య ఆర్ ఐ నరసింహులు వీఆర్వోలు విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-కార్వేటినగరం.ధర్మ చెరువు నుండి తన్విష్ పుట్టినరోజు సందర్భంగా తండ్రి టి. వేణు రాస్ వృద్ధాశ్రమం నందు అన్నదానం పండ్లు స్వీట్లు ఏర్పాటు చేయండి ఈ కార్యక్రమంలో జై భీమ్ ఫౌండేషన్ సంబంధించిన వారు, రిటైర్డ్ టీచర్ గుర్రప్ప, వెంకటరామయ్య, రాజ్ కుమార్, పరంధామయ్య, నరేష్, అనిల్, ప్రశాంత్, రా స్ సూపర్వైజర్ ప్రకాష్ వృద్ధులు పాల్గొన్నారు.

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డైరీ క్యాలెండర్ల ఆవిష్కరణ

విశాలాంధ్ర - కార్వేటి నగరం. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం నందు ఎంఈఓ.విజయ్ కుమార్ ఎంఈఓ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించడమైనది ఈ కార్యక్రమం పురస్కరించుకొని ఎంఈఓ శ్రీ విజయకుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు హక్కులు బాధ్యతలు రెండు కళ్ళ వంటివి బాధ్యతతో పనిచేసే హక్కులకై పోరాడాలని సూచించారు. ఎంఈఓ 2 మనోజ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయులందరూ చక్కగా పనిచేసే మండల అభివృద్ధికి పిల్లల అభివృద్ధికి తోడ్పాడాలని సూచించిరి ఈ సందర్భంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సోషల్ మీడియా కన్వీనర్ వేణుగోపాల్ కొత్తగా ఎన్నికైన గౌరవఅధ్యక్షులు పీతంబ రెడ్డిని మండల అధ్యక్షులు సురేష్ బాబుని ప్రధాన కార్యదర్శి అయిన ప్రకాష్ ను మరియు జిల్లా నాయకులు మండల నాయకులు అయిన చక్రవర్తి, మహేష్,ప్రవీణ్ సుబ్రహ్మణ్యం, భూపతి, గిరి,రాజేంద్ర,వెంకటేష్, రామ్మోహన్, ప్రవీణ్, మహిళా నాయకులైన రూప, జ్యోతి, ద్రాక్షాయని, లీలాకుమారి, శిరీష మొదలగువారు ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన డైరీ మరియు క్యాలెండర్లను ఆవిష్కరించి ఎంఈఓ లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-కార్వేటి నగరం. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తాసిల్దార్ కే నాగరాజు తెలియజేశారు ఈ మేరకు తాసిల్దార్ కార్యాలయంలో విఆర్ వోలు మరియు విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు పి జి ఆర్ ఎస్ పిటిషన్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి పిటిషనర్లకు న్యాయం చేయాలని సకాలంలో పిటిషన్లని క్లోజ్ చేయడంతో పాటు పిటీషనర్ కి ఎండామెంట్లు ఇచ్చి రీ ఓపెన్ కి అవకాశం లేకుండా వారిని సంతృప్తి పరచాలన్నారు అలాగే ఏపీ సేవ మీ సేవ వాటర్ టాక్స్ కి సంబంధించి పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు క్యాస్ట్ సర్టిఫికెట్ నుండి వరకు అన్నింటిని గడువుకు ముందే క్లోజ్ చేయాలన్నారు జనవరి ఒకటో తేదీ నుండి ఏ ఒక్క సర్టిఫికెట్ గడువు తర్వాత పూర్తి చేస్తే అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు లేకుండా జరుగుతుందని హెచ్చరించారు మండలంలో గ్రావెల్ ఇసుక రవాణాకి మనమెవ్వరు అనుమతులు ఇవ్వలేదని అక్రమంగా రవాణా కాకుండా వీఆర్వోలు వీఆర్ఏలు ప్రత్యేక నిఘా ఉంచాలని అలా చేస్తే వారిపై కఠిన చర్యలు గైకొంటామని హెచ్చరించారు ప్రతి ఉద్యోగి ప్రతిరోజు సచివాలయాలకి సంబంధించిన లాగిన్లను పరిశీలించి గడువుకు ముందే అన్నింటిని క్లోజ్ చేసేందుకు సహకరించాలని సూచించారు ఈ సమావేశంలో తాసిల్దారులు లోకేష్ యాదవ్ స్వరూప రాణి మండల సర్వేయర్ మార్ కొండయ్య ఆర్ ఐ నరసింహులు వీఆర్వోలు విలేజ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు

వేణుగోపాల స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఆలయం ముస్తాబు

విశాలాంధ్ర - కార్వేటి నగరం: కార్వేటినగరం : కార్వేటి నగరంలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని మంగళవారం ఉదయం 1 :35 గంటల నుంచి ఆలయం వద్ద భక్తులకు దర్శనం కల్పించినట్లు ఆయన తెలిపారు. బుధవారం ఉదయం తెల్లవారుజామున 5:30 గంటలకు తిరుచి వానిపై స్వామి అమ్మవార్లు ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు.

రెవెన్యూ సదస్సులు రైతులు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - చిట్టమూరు :భూ సమస్యలు పరిష్కరించేందుకు రీ సర్వే ప్రాజెక్ట్ 4వ విడతలో భాగంగా వచ్చేనెల 2వ తేదీ నుంచి చిట్టమూరు మండలంలోని అన్నీ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని,సోమవారం తాసిల్దార్ నవీన్ ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మంగళవారం పల్లంపర్తి,లో ఉదయం 10 గంటలకు ఎంపీపీ స్కూల్ నందు,మల్లాంలో మధ్యాహ్నం 12 గంటలకు సచివాలయం నందు,పేరంటాలమిట్ట మధ్యాహ్నం 3గంటలకు ఎంపీపీ స్కూల్ నందు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు.భూ యజమానులు,రైతులు తమ భూమి రికార్డుల యందు ఏమైనా తప్పులు ఉన్నా,లేదా అర్హత ఉండి రెవెన్యూ రికార్డుల యందు పేర్లు నమోదు కాకపోయినా,మరియు ఇతర భూ సమస్యలు ఉన్నా రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని సూచించారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏకవీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-రేణిగుంట: :రేణిగుంట మండలం జి పాల్యం పంచాయతీలోని కుర్ర కాలువలో సోమవారం ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి సహకారంతో బిజెపి నాయకుడు వేణు ముదిరాజ్ ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల ఉపాధ్యక్షుడు రాజా రాయల్ మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సూచనల మేరకు కుర్ర కాలవలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీ పాలెం మాజీ సర్పంచ్ కుర్రకాలవ రాణేమ్మ, సాయి, సెల్వా, వృద్ధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

మరుగుదొడ్డికి పార్టీ రంగు -పలువురు విమర్శలు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ భవనాలకు తెలుగుదేశం పార్టీ రంగు అయినటువంటి పసుపు రంగు వేయడం అనేది విమర్శలకు తావిస్తున్నది. మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం సోమవారం లో అధికారుల కోసం ఏర్పాటుచేసిన మరుగుదొడ్డి నిర్మాణం పనులు పూర్తి కావడంతో మరుగుదొడ్డికి పసుపు రంగు వేయడం పైఇది అధికార పార్టీ తెలుగుదేశం పార్టీ తమ రంగును ప్రచారం చేసుకోవడానికి మరియు ప్రభుత్వ భవనాలకు రంగులు వేయడం ద్వారా రాజకీయ విమర్శలకు దారితీస్తోంది. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ హయాంలో పసుపు రంగు వేయడంపై విమర్శలు వస్తున్నాయి, ఉపయోగం లేని ఈ రంగుల కోసం ప్రభుత్వం నిధులను రక్షించడంపై విమర్శలకు వెల్లువెత్తుతున్నాయి.ఈ రంగుల వ్యవహారం ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై కూడా విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ భవనాలకు పసుపు రంగు వేయడం అనేది రాజకీయ పార్టీల గుర్తింపు అధికార ప్రదర్శన మరియు ప్రభుత్వ నిధులు వినియోగంపై వివాదాలకు కారణమవుతున్నది.

స్థల వివాదంపై తహసీల్దార్ కు వినతి

విశాలాంధ్ర-బాలాయపల్లి: మండలంలోని జయంపు గ్రామానికి చెందిన పండ్లూరు కృషా?రెడ్డి స్వాధీనం లో సర్వే నంబర్ 158/1, 7 లో ఉన్న స్థలానికి ఏర్పాటు చేసుకున్న పెన్సింగ్ రాళ్ళను అదే గ్రామానికి చెందిన పొదలకూరు శ్రీనివాసులు నాయుడు, ఆయన భార్య, కుమారుడు తో పాటు బయట వ్యక్తులు మరి కొందరు కలసి మాపై రాడ్లు, కర్ర లతో దౌర్జన్యం చేసి పెన్సింగ్ తొలగించారని సోమవారం తహసీల్దార్ విజయలక్ష్మి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృషా? రెడ్డి కుమార్తె లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ తమ స్వాదినం లో ఉన్న స్థలం లో ఎంతోకాలంగా పశువులు కట్టేసుకుంటున్నామన్నారు. ఈ స్థలం విషయమై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం లో కేసు వేయగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారని పేర్కొన్నారు. కోర్టులో ఉన్న విషయాన్ని స్థలం లో బోర్డు ఏర్పాటు చేయగా శ్రీనివాసులు నాయుడు కుటుంబ సభ్యులు ఆదివారం దౌర్జన్యం గా తొలగించరన్నారు. మాపై దాడికి దిగి దౌర్జన్యం గా పెన్సింగ్ రాళ్ల తొలగించిన విషయం పై పోలీసులకు పిర్యాదు చేయడం జరిగిందన్నారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని తహసీల్దార్ ను కోరారు.

బంగారుపాళ్యం క్రికెట్ టోర్నీ విజేత తగ్గువారిపల్లె

విశాలాంధ్ర-బంగారుపాళ్యం: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలోని శ్రీ వజ్రాలపురం బోయకొండ గంగమ్మ దేవస్థానం సమీపంలో నూతనంగా నిర్మించిన కేయంటి క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో తగ్గువారిపల్లె జట్టు ప్రథమ స్థానంలో నిలిచి విజేతగా ఆవిర్భవించింది. డిసెంబర్ 24 నుండి 29 వరకు నిర్వహించిన ఈ క్రీడల్లో మొత్తం 16 జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. విజేతలు - బహుమతులుప్రథమ బహుమతి: తగ్గువారిపల్లె జట్టు (రూ. 15,000/- నగదు). ఈ బహుమతిని దేవస్థానం ధర్మకర్తలు కీ.శే. రాధమ్మ, శ్రీ కృష్ణప్పల కుమారుడు కె. గోపి విరాళంగా అందజేశారు.ద్వితీయ బహుమతి: టేకుమంద జట్టు (రూ. 7,000/- నగదు). ఈ మొత్తాన్ని బొమ్మాయపల్లె గౌరీ యూత్ వారు విరాళంగా ఇచ్చారు. సోమవారం జరిగిన ముగింపు వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.పి. జయప్రకాష్, మండల టీడీపీ అధ్యక్షులు ఎన్.పి. ధరణిప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారుఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ హేమచంద్ర నాయుడు, కరా?టక రాష్ట్ర ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ అట్లూరి వేణుగోపాల్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బుసా జనార్ధన్ గౌడ్, జి. సురేంద్ర నాయుడు, బుసా నాగరాజ గౌడ్ పాల్గొన్నారు. స్టేడియం వ్యవస్థాపకులు కోటపాటి మహాలక్ష్మి, తులసి, పునీత్, నిరంత్ తదితరులు క్రీడల నిర్వహణను పర్యవేక్షించారు

ఈ ఎస్ ఎస్ డిగ్రీ కాలేజీలో వాజ్‌పేయి స్మృతి సమ్మేళనం

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి పురపాలక పట్టణంలోని, అడ్డ రోడ్డు దగ్గరలో ఉన్నటువంటి డిగ్రీ కాలేజీలో, భారతరత్న, మాజీ భారత ప్రధానమంత్రి శ్రీ అటల్ బిహారీ వాజ్పేయి స్మృతి సమ్మేళనం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య ఉపన్యాసకులుగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ ఎస్ ఎస్ ఆర్ నాయుడు , డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్.పాల్గొని ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, భారతీయ జనతా పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు మరియు కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా సోమవారం రేణిగుంట తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ క్లినిక్, రిసెప్షన్ కేంద్రాన్ని తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. మండలంలో వివిధ రెవిన్యూ సమస్యలపై తాసిల్దార్ కార్యాలయానికి వస్తే సిబ్బంది అందుబాటులో ఉండి తమ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.తక్షణం పరిష్కారం అయ్యే చిన్న చిన్న సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తామని, మిగిలిన వాటికి గడువు తీసుకొని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండల ప్రజలు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మొత్తం 26 సమస్యలు వచ్చాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ లెటర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- వెంకటగిరి: వెంకటగిరి నియోజకవర్గ యూనిట్ ద్వారా రూపొందించిన న్యూస్ లెటర్‌ను వెంకటగిరి నియోజకవర్గ శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష? తమ చేతుల మీదగా ఈ రోజు అధికారికంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా యూనిట్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రభుత్వ అభివృద్ధి పథకాలు మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో న్యూస్ లెటర్ కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యూనిట్ చేస్తున్న సేవలను అభినందిస్తూ, ఇలాంటి సమాచార ఆధారిత కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెంకటగిరి యూనిట్ సిబ్బంది, వెంకటగిరి యంగ్ ప్రొఫెషనల్ చెంచయ్య గెరిటి, అరగొండ పృధ్వి రాజ్,. సాయి కృష?, రేఖ, . రవి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అక్షరాక్షరం అభ్యుదయం

సబ్-ఎడిటర్స్ కావలెను

తిరుపతి ఎడిషన్ ఆఫీసులో పనిచేయుటకు సబ్-ఎడిటర్స్ కావలెను.

తెలుగు భాషపై పట్టు, వార్తలు, సామాజిక, రాజకీయ అంశాలపై పరిజ్ఞానం కలిగి ఉండాలి.

విద్యార్హతలు: డిగ్రీ పాసైయుండి తెలుగు టైపింగ్, ఫొటో షాప్, క్వార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పేజీలు పెట్టగలిగి ఉండాలి.

గమనిక: అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

ఎడిషన్ మేనేజర్

అడ్రస్: విశాలాంధ్ర ఎడిషన్ కార్యాలయం, డోర్ నెం.9-91/5, ఇందిరమ్మ గృహాలు ఎదురుగా దామినేడు, తిరుపతి రూరల్. సెల్: 9490952129